సాక్షి విశాఖపట్నం

శుక్రవారం । 21 । మార్చి । 2025



నిరసన తెలుపుతున్న మాజీ మంత్రి అమర్‌నాథ్, మేయర్ హరి వెంకట కుమారి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, మాజీ ఎంపీ మాధవి, మాజీ ఎమ్మెల్యేలు అదీప్‌రాజ్, తైనాల, చింతలపూడి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు



ప్రభుత్వ భూమిలో దర్జాగా కొనసాగుతున్న నిర్మాణాలు

రూ.40 కోట్ల సర్కారు భూమికి రెక్కలు

కొమ్మాదిలో సుమారు 3.9 ఎకరాలు కబ్జా చేసేస్తున్న తెలుగు తమ్ముళ్లు

సుమారు రూ.40 కోట్ల విలువైన 3.9 ఎకరాల ప్రభుత్వ భూమిని.. టీడీపీ నేతలే భూ రాబందులుగా మారి తమ కబంధహస్తాల్లోకి లాగేసుకుంటున్నారు. ఈ అక్రమార్కులకు ఓ రెవెన్యూ అధికారి పూర్తి అండదండలు అందిస్తున్నారు. నిర్మాణాలు కూల్చేయాలని ఆర్డీవో చెప్పినా.. బేఖాతరు చేస్తూ ఎవరొస్తారో చూద్దాం.. మీ పని మీరు కానివ్వండంటూ అభయహస్తమివ్వడంతో బరితెగించేస్తున్నారు.

- నిర్మాణాలు చేపట్టొద్దని ఆదేశించిన హైకోర్టు
- అయినా డీ పట్టా భూముల్లో దర్జాగా ఆక్రమణలు
- సహకరిస్తున్న భీమిలి రెవెన్యూ అధికారులు
- ఉన్నతాధికారులకు మాత్రం నిర్మాణాలు ఆపేశామంటూ నివేదికలు

సాక్షి, విశాఖపట్నం : విశాఖ రూరల్ తహసీల్దార్ కార్యాలయం పరిధిలోని వెంకట్‌నగర్ సమీపంలో కొమ్మాది సర్వే నం.157/1లో 3.93 ఎకరాల డి–ఫారం పట్టా భూమి అక్రమార్కుల చేతుల్లో చిక్కుకుంది. నాలుగైదు దశాబ్దాల క్రితం పైడితల్లి అనే వ్యక్తి ఈ భూమి సాగుచేసుకునేవారు. అప్పట్లో ఆయనకు డీ–పట్టా ఇచ్చారు. సదరు పైడితల్లి తర్వాత ఈ భూమిని వదిలేశారు. అప్పటి నుంచి ఇది ప్రభుత్వ భూమిగా రికార్డుల్లోనే ఉంది. గంటా శ్రీనివాసరావు మంత్రిగా ఉన్న సమయంలో ఇక్కడ ప్రభుత్వ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన కూడా చేశారు. కానీ.. ఈ ప్రాజెక్టు అర్ధాంతరంగా ఆగిపోయింది. అప్పటి నుంచి టీడీపీ నేతల కన్ను ఈ భూమిపై పడింది. గంటాకు సన్నిహితులం, 6వ వార్డుకు చెందిన టీడీపీ నాయకుడి అనుచరులమంటూ కొందరు ఈ భూమిని ఆక్రమించేందుకు పన్నాగం పన్నారు. గతంలో పైడితల్లికి ఇచ్చిన పట్టా మాదిరిగా దొంగ డాక్యుమెంట్లు సృష్టించేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో అధికారులు ఈ భూమిని కాపాడారు. దీంతో సదరు భూ కబ్జాదారులు కొందరు రెవెన్యూ అధికారుల సూచనలతో కోర్టుకు వెళ్లారు. అయితే.. ఇది పక్కాగా ప్రభుత్వ భూమిగా రికార్డులు స్పష్టం చేస్తుండటంతో కోర్టు స్టేటస్‌కో ఇచ్చింది.

ప్రభుత్వం మారిన వెంటనే..

ప్రస్తుతం ఈ స్థల వివాదం న్యాయస్థానంలో ఉంది. యథాతథ స్థితిగా భూమిని ఉంచాలని కోర్టు స్పష్టం చేసింది. అయినా.. ఓ రెవెన్యూ అధికారి అండతో ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. చుట్టూ ఫెన్సింగ్ మాదిరిగా వేసేసి.. భూమిని చదును చేసేశారు. కోళ్లఫారం ఏర్పాటు చేసేందుకు నిర్మాణాలు కూడా చకచకా సాగిపోతున్నాయి. ఈ విషయం తెలుసుకున్న స్థానిక సచివాలయ సిబ్బంది ఆ నిర్మాణాలను అడ్డుకున్నారు. తగిన ధ్రువపత్రాలతో తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించాలని నోటీసులు జారీ చేశారు. అయినా ఆగకుండా నిర్మాణాలు చేస్తుండటంతో ఆర్డీవోకి ఫిర్యాదు వెళ్లింది. ఇటీవలే ఆర్డీవో సంగీత్ మాథుర్ స్థలాన్ని పరిశీలించి వెంటనే నిర్మాణాలు ఆపించేసి మొత్తం తొలగించాలని స్థానిక రెవెన్యూ అధికారులను ఆదేశించారు. వెంటనే నిర్మాణాలు ఆపేశారు.




రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా 157/1 సర్వే నం

అక్రమార్కులకు రెవెన్యూ అధికారి అభయం!

ఆర్డీవో, తహసీల్దార్ ఆదేశించినా.. స్థానిక రెవెన్యూ అధికారి మాత్రం భూ కబ్జాదారులకు అభయహస్తమిచ్చేశారు. 'మీ నిర్మాణాల పని మీరు కానివ్వండి.. ఎవరు ఆపుతారో నేనూ చూస్తానన్నట్లు'గా అండగా నిలబడ్డారు. తహసీల్దార్, ఆర్డీవో, జేసీ ఎవరు వచ్చినా.. నేను చూసుకుంటానంటూ.. అందరూ నా మాటే వింటారని సదరు రెవెన్యూ అధికారి చెబుతుండటం గమనార్హం. దీంతో కోళ్ల ఫారం నిర్మాణాలు చకచకా సాగిపోతున్నాయి. ఉన్నతాధికారులు సర్వే నం.157/1 భూమి పరిస్థితి ఏంటని అడిగితే మాత్రం.. ప్రభుత్వ ఆధీనంలో ఉంది.. ఎలాంటి నిర్మాణాలు జరగడం లేదని తప్పుడు నివేదికలు అందజేస్తున్నట్లు తెలుస్తోంది. ఆక్రమణలు చేపడుతున్న కబ్జాదారుల నుంచి రూ.లక్షలు దండుకొని రెవెన్యూ సిబ్బంది పంచుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పేదల ఇళ్లు, చిన్న చిన్న దుకాణాలపై ప్రతాపం చూపిస్తున్న జిల్లా అధికార యంత్రాంగం.. రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతుంటే మాత్రం .. తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వైఎస్సార్ పేరు తొలగింపులో కుట్ర

- క్రికెట్ స్టేడియం వద్ద వైఎస్సార్ సీపీ ధర్నా
- ఏసీఏ 48 గంటల్లో సమాధానం చెప్పాలని డిమాండ్



సాక్షి, విశాఖపట్నం : పీఎంపాలెంలోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంకు ఉన్న డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పేరును తొలగించేందుకు చేస్తున్న కుట్రను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ హెచ్చరించారు. స్టేడియం ఆధునీకరణ పనుల్లో భాగంగా ఏర్పాటుచేసిన ఎంట్రన్స్ ఆర్చ్‌పై వైఎస్సార్ పేరు తొలగింపునకు నిరసిస్తూ గురువారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. తొలుత మేయర్ గొలగాని హరివెంకటకుమారి, జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, అరకు మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి, మాజీ ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు, రాష్ట్ర, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్పొరేటర్లతో కలిసి ఆయన స్టేడియం వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నల్ల రిబ్బన్లతో ఆందోళన చేశారు. అక్కడ ఆయన మాట్లాడుతూ మహానేత వైఎస్సార్ ఆనవాళ్లను తుడిచేయాలని సీఎం చంద్రబాబు అనుకోవడం ఆయన అవివేకానికి నిదర్శనమని మండిపడ్డారు. 2009 సెప్టెంబర్ 14న అప్పటి ఏసీఏ అధ్యక్షుడు గోకరాజు గంగారాజు ఆధ్వర్యంలో ఏసీఏ–వీడీసీఏ స్టేడియాన్ని వైఎస్సార్ ఏసీఏ–వీడీసీఏ స్టేడియంగా మార్చినట్లు గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్ మార్క్, బ్రాండ్ కనబడకూడదనే కుట్రతోనే పేరును తొలగిస్తున్నారని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అభివృద్ధి చేసిన సీతకొండ వ్యూ పాయింట్‌కు వైఎస్సార్ పేరు పెడితే దాన్ని తొలగించారని మండిపడ్డారు. విశాఖ ఫిల్మ్‌నగర్ క్లబ్ లాన్‌కు వైఎస్సార్ పేరు తొలగించారని, ఇవే కాకుండా ఉమ్మడి విశాఖ జిల్లాలో అనేక చోట్ల వైఎస్సార్ విగ్రహాలు ధ్వంసం చేశారన్నారు.

ముఖ్య నాయకులకు బెదిరింపు

అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వద్ద వైఎస్సార్ సీపీ ఆందోళన చేయనున్న నేపథ్యంలో బుధవారం అర్ధరాత్రి నుంచే వైఎస్సార్ సీపీ సమన్వయకర్తలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు, కార్పొరేటర్లకు పోలీసులు ఫోన్లు చేసి బెదిరింపులకు పాల్పడ్డారు. నిరసన కార్యక్రమానికి ఎవరినైనా తీసుకెళ్తే అరెస్ట్ చేస్తామని హెచ్చరికలు జారీ చేశారు. విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజును పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు.

నిరసనలో మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయకుమార్, చింతలపూడి వెంకటరామయ్య, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, కె.భాగ్యలక్ష్మి, శోభా హైమావతి, నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల శ్రీనివాస్ దేవన్ రెడ్డి, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కటుమూరి సతీష్, పార్టీ కార్యాలయ పర్యవేక్షకుడు రవిరెడ్డి, రాష్ట్ర అనుబంధ విభాగాల అధ్యక్షులు బొల్లవరపు జాన్‌వెస్లీ, పేర్ల విజయచంద్ర, పార్టీ ముఖ్య నాయకులు రొంగలి జగన్నాథం, కొండా రాజీవ్‌గాంధీ, మొల్లి అప్పారావు, వుడా రవి, జహీర్ అహ్మద్, గండి రవి, శోభాస్వాతి రాణి, కార్పొరేటర్లు రెయ్యి వెంకట రమణ, అక్కరమాని పద్మరాము నాయుడు, డొలపల్లి ఏడుకొండలరావు, కోరుకోడ వెంకట రత్న స్వాతి దాస్, పద్మా రెడ్డి, బిపిన్ కుమార్ జైన్, కె.వి.శశికళ, గుడివాడ అనూష, ఇమ్రాన్, జిల్లా కార్యవర్గం కమిటీ, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు బోని బంగారు నాయుడు, నడింపల్లి కృష్ణంరాజు, చెన్నా జానకీరామ్, ముప్పల సురేష్, ద్రోణంరాజు శ్రీవాస్తవ్, బింగి హరి కిరణ్ రెడ్డి, పల్లా దుర్గారావు, మనలత జాబ్దాస్ (చిన్ని), పేడాడ రమణి కుమారి, వంకాయల మారుతీ ప్రసాద్, పీలా కిరణ్ జగదీష్, రామారెడ్డి, రాయపు అనిల్ కుమార్, లావణ్య చిమట, శెట్టి రోహిణి, పిల్లి సుజాత, పిల్లా సుజాత, అల్లంపల్లి రాజబాబు, మాధవీవర్మ, మజ్జి వెంకట రావు, బంకు సత్య, పోలిరెడ్డి, శ్రీదేవి వర్మ, రాజేశ్వరి, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

గుర్తులు చెరిపేయాలనే..

కూటమి ప్రభుత్వం వైఎస్సార్ పేరును చూస్తేనే ఉలిక్కిపడుతోందని అమర్‌నాథ్ ఎద్దేవా చేశారు. వైఎస్ రాజశేఖరరెడ్డి విశాఖను ఆర్థిక రాజధానిగా తీర్చిదిద్దారన్నారు. ఆయన కృషిని గుర్తించి ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఈ ప్రాంతంలో స్టేడియంకు వైఎస్సార్ పేరు పెడితే ఇప్పుడు దానిని కూడా తొలగించారని ఆందోళన వ్యక్తం చేశారన్నారు.

ఏసీసీలో తిష్ట వేసిన టీడీపీ ఎంపీల ఒత్తిడితోనే..

వైఎస్సార్ పేరును ఏసీఏ తొలగించిందా? లేదంటే కూటమి ప్రభుత్వం ఒత్తిడితో తొలగించారా? 48 గంటల్లో సమాధానం చెప్పాలని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్‌ను డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఏసీఏలో రెండు కీలక పదవుల్లో టీడీపీకి చెందిన ఎంపీలు ఉన్నందునే ఈ దుర్మార్గానికి ఒడిగట్టారనేది స్పష్టంగా అర్థమవుతుందని తెలిపారు. బీసీసీఐ నిబంధనల ప్రకారం రాజకీయ పదవుల్లో ఉన్నవారు క్రికెట్ అసోసియేషన్‌లకు బాధ్యత వహించకూడదనేది ఉందని, దానిని కూడా ఉల్లంఘించి టీడీపీ ఎంపీలు ఏసీఏలో తిష్టవేశారన్నారు.

న్యూస్‌రీల్

ఐఐఎంవీలో నూరుశాతం ప్లేస్‌మెంట్స్



విద్యార్థులతో యాజమాన్య ప్రతినిధులు

తగరపువలస: ఐఐఎంవీ 2024–2026 బ్యాచ్ నూరుశాతం నియామకాలతో వేసవిని విజయవంతంగా ముగించినట్టు ప్రకటించింది. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ వేసవి ప్లేస్‌మెంట్ ప్రక్రియలో 344 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. 130 మంది రిక్రూటర్లు నియామక జాబితాలో చేరారన్నారు. వీరిలో 77 మంది కొత్తగా తమతో భాగస్వామ్యం పొందారన్నారు. కెరీర్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ చైర్‌పర్సన్ దీపికా గుప్తా మాట్లాడుతూ అంచనాలు అధిగమించి నూరు శాతం ఫలితాలు సాధించామన్నారు. గతేడాదితో పోలిస్తే స్టైఫండ్‌లో 45.83 శాతం గ్రోత్ ఉందన్నారు.

రుషికొండ బీచ్‌లో పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న ఏపీ టూరిజం ఎండీ ఆమ్రపాలి

కొమ్మాది : రుషికొండ బీచ్‌లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఆమ్రపాలి గురువారం పరిశీలించారు. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని టూరిజం అధికారులకు సూచించారు. ఇక్కడకు వచ్చే పర్యాటకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అభివృద్ధి పనులు నిర్వహించాలని సూచించారు. ఆమె వెంట ఆర్డీ జగదీష్, ఏఎంఓహెచ్ కిశోర్ తదితరులు ఉన్నారు.

నేడు జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం శుక్రవారం నిర్వహించనున్నారు. నగర మేయర్, స్థాయి సంఘం చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన ఉదయం 11 గంటల నుంచి జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశ మందిరంలో నిర్వహించనున్న సమావేశంలో 104 అంశాలు సభ్యుల ముందుకు చర్చకు రానున్నాయి. పలు అభివృద్ధి అంశాలతో పాటు ఉద్యోగుల సర్వీస్ అంశాలు చర్చకు రానున్నాయి.

క్యాష్ కొట్టు.. స్టాఫ్ నర్స్ పోస్టు పట్టు

- నర్సింగ్ పోస్టులకు కూటమి నాయకుల బేరాలు
- పోస్టుకు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వసూళ్లు
- రెండు రోజుల్లో మెరిట్ జాబితా.. 31లోగా తుది జాబితా



మహారాణిపేట: స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీలో పైరవీలు జోరందుకున్నాయి. ఈ పోస్టులను కూటమి నేతలు ఆదాయ వనరుగా మార్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. వీరికి వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వంత పాడుతూ పైరవీలకు తెరతీస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమ అనుకూలురికి పోస్టులు కట్టబెట్టేందుకు వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ డైరెక్టర్(ఆర్డీ) మీద తీవ్ర ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. ఒక వైపు సిఫార్సుల లేఖలు, మరో వైపు ప్రజాప్రతినిధులు, వారి పీఏలు ఫోన్లు మీద ఫోన్లతో ఒత్తిడి పెంచుతున్నట్లు సమాచారం.

బేరసారాలు : ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లో 106 స్టాఫ్ నర్సుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని ఏడాది కాలానికి కాంట్రాక్ట్ పద్ధతిన భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఇచ్చారు. 8,309 దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో పోస్టుకు 88 మంది చొప్పున పోటీ నెలకొనడంతో కూటమి నేతల పంట పండినట్లయింది. ఒక్కో పోస్టు కోసం రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలు వరకు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. వైద్య ఆరోగ్యశాఖ ఆర్డీ ఆధ్వర్యంలో ప్రొవిజినల్ జాబితా మీద వచ్చిన 1,530 అభ్యంతరాల వడపోత కార్యక్రమం జరుగుతోంది. రెండు రోజుల్లో మెరిట్ జాబితా వెల్లడికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 31 లోపు రోస్టర్ ప్రకారం పోస్టులను భర్తీ చేయాలని అధికారులు కసరత్తు చేపట్టారు.

రంగంలోకి దళారులు : మరోవైపు దళారులు కూడా రంగంలోకి దిగారు. దరఖాస్తుదారుల్ని మాయ మాటలు చెప్పి నమ్మించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఎమ్మెల్యే సిఫార్సు లేఖ ఇవ్వడంతోపాటు, కార్యాలయ సిబ్బందితో బేరాలకు దిగుతున్నారు. కార్యాలయంలో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన ఉద్యోగులు ఎక్కువగా ఉన్నారు. వారి ద్వారా పోస్టులకు ధర నిర్ణయిస్తున్నారు. వీరు కూడా పోస్టుకు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అందులోనూ అడ్వాన్స్ ముడుపులిచ్చేవారికే పోస్టింగ్ అంటూ నమ్మబలుకుతున్నారట.

దళారులను నమ్మొద్దు



పోస్టుల భర్తీ మెరిట్ ప్రకారమే జరుగుతుంది. దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు. అర్హత ప్రమాణాలు, మెరిట్, రోస్టర్ ప్రకారం ప్రాథమిక ఎంపిక జాబితా సిద్ధం చేస్తున్నాం. దీనిపై కూడా అభ్యంతరాలు స్వీకరించి, వాటిని పరిష్కరించాకే తుది ఎంపిక జాబితాను వెల్లడిస్తాం.

– డాక్టర్ రాధారాణి, ఆర్డీ, వైద్య ఆరోగ్యశాఖ

73 చోరీ కేసుల్లో రూ.93.21 లక్షలు రికవరీ

విశాఖ సిటీ: నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఫిబ్రవరి నెలలో 73 చోరీ కేసులను ఛేదించి 103 మంది నిందితులను అరెస్టు చేసినట్లు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. గురువారం పోలీస్ సమావేశ మందిరంలో చోరీ కేసుల్లో స్వాధీనం చేసుకున్న నగదు, ఆభరణాలు, ఇతర వస్తువులను ప్రదర్శించి రికవరీ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చోరీ కేసుల్లో నిందితుల నుంచి మొత్తంగా రూ.93,21,435 విలువైన నగదు, బంగారం, వెండి, మొబైల్స్, వాహనాలను రికవరీ చేసినట్లు చెప్పారు. ఇందులో 660.655 గ్రాముల బంగారం, 2,008.3 గ్రాముల వెండి, రూ.2,73,575 నగదు, 14 బైక్‌లు, 2 ల్యాప్‌టాప్‌లు, 419 మొబైల్ ఫోన్లు ఇలా మొత్తంగా రూ.93,21,435 విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. నగరంలో నేర నియంత్రణకు చేపడుతున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయని వివరించారు. గత నెలలో నగరంలో 751 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు 203 నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. అలాగే నేరాలు జరిగే ప్రాంతాల్లో ప్రత్యేక పెట్రోలింగ్ బృందాలను ఏర్పాటు చేసి 24 గంటలు నిఘా పెట్టినట్లు తెలిపారు. అనంతరం ఆభరణాలు, బైక్‌లు, ఇతర వస్తువులను వాటి యజమానులకు సీపీ చేతుల మీదుగా అందజేశారు.



బాధితురాలికి ఆభరణాలను అందజేస్తున్న సీపీ



బాధితుడికి బైక్ తాళం అందజేస్తున్న సీపీ బాగ్చి

8న అప్పన్న వార్షిక కల్యాణోత్సవం

సింహాచలం: అన్ని శాఖల సమన్వయంతో వచ్చే నెల 8న జరగనున్న శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవో కె.సుబ్బారావు తెలిపారు. వార్షిక కల్యాణోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లపై సింహగిరిపై గురువారం పోలీస్, వైద్యారోగ్య, ఈపీడీసీఎల్, ఆర్టీసీ, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ తదితర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ వచ్చే నెల 8న రాత్రి 8 గంటల నుంచి స్వామి రథోత్సవం, 10.30 గంటల నుంచి వార్షిక కల్యాణోత్సవం జరుగుతుందని తెలిపారు. ఆ రోజు తీసుకోవాల్సిన చర్యలు, బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, వైద్య శిబిరాల నిర్వహణ, ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచడం, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై చర్చించి సూచనలు చేశారు. ట్రాఫిక్ ఏసీపీ వాసుదేవ్, సీఐ గొలగాని అప్పారావు, ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న ఈవో సుబ్బారావు

ఎట్టకేలకు డీఆర్‌ఎం బంగ్లా ఖాళీ


సాక్షి, విశాఖపట్నం : లంచం తీసుకుంటూ సీబీఐకి చిక్కిన వాల్తేరు పూర్వ డీఆర్‌ఎం సౌరభ్‌కుమార్ ప్రసాద్ ఎట్టకేలకు విశాఖలోని తన నివాసాన్ని ఖాళీ చేశారు. గతేడాది నవంబర్‌లో ముంబయిలోని ఓ కాంట్రాక్టు సంస్థకు చెందిన వ్యాపారుల నుంచి లంచం తీసుకుంటూ సౌరభ్‌కుమార్ దొరికిపోయిన సంగతి తెలిసిందే. రూ.25 లక్షలు ఇచ్చేందుకు వ్యాపారులు అంగీకరించడంతో పుణేలో లంచం తీసుకుంటూ కేంద్ర దర్యాప్తు సంస్థకు రెడ్ హ్యాండెడ్‌గా సౌరభ్‌కుమార్ దొరికిపోయారు. అప్పటి నుంచి సీబీఐ జైలులోనే సౌరభ్‌కుమార్ ఉన్నారు. పలుమార్లు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నా సీబీఐ ప్రత్యేక కోర్టు తిరస్కరించింది. చివరికి సొంత పూచీకత్తుతో గత నెల 28న బెయిల్ మంజూరు చేసింది. తాజాగా.. లలిత్ బోరా డీఆర్‌ఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత.. నివాస గృహం అవసరమైంది. అయితే గత డీఆర్‌ఎం ఖాళీ చేయకపోవడంతో గెస్ట్ హౌస్‌లో నివాసముంటున్నారు. రైల్వే బోర్డు ఆదేశించడంతో సౌరభ్‌కుమార్ ఎట్టకేలకు గురువారం సాయంత్రం డీఆర్‌ఎం బంగ్లాను ఖాళీ చేశారు. బంగ్లాలో ఉన్న తన ఇంటి సామగ్రిని తీసుకువెళ్లినట్లు వాల్తేరు డివిజన్ అధికారులు తెలిపారు.



ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాలు విడుదల


విశాఖ విద్య: ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాలను ప్రకటించినట్లు డీఈవో ఎన్.ప్రేమ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. టీఐఎస్‌లో నమోదైన వివరాల మేరకు వీటిని వెల్లడించామన్నారు. వీటిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తగిన ఆధారాలతో ఈ నెల 24 సాయంత్రం 5గంటల్లోపు విశాఖపట్నంలోని డీఈవో కార్యాలయంలో అందజేయాలన్నారు. గడువు తర్వాత అందిన అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోమని స్పష్టం చేశారు. అందిన అభ్యంతరాలపై జిల్లా స్థాయి కమిటీ పరిశీలించి, తుది నిర్ణయం తీసుకుంటుందని, ఆ మేరకు ఫైనల్ సీనియార్టీ జాబితా ప్రకటిస్తామన్నారు. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు దీన్ని గమనించి, జాబితాలను పరిశీలించుకోవాలని సూచించారు.

వన్యప్రాణులు విలవిల!




జూ పార్కులో వన్యప్రాణులు ఎండకు విలవిల్లాడుతున్నాయి. వేడి తీవ్రతను తట్టుకోలేక వాటి ఎన్‌క్లోజర్లలోని చెట్లు, అక్కడ వేసిన కమ్మల పాకల కిందికి చేరుతున్నాయి. దీంతో సందర్శకులకు దూరంగా కనిపిస్తున్నాయి. ఏనుగులు ఎక్కువగా ప్రకృతి ఆహారానికి ప్రాధాన్యత ఇస్తున్నాయి. సాధారణంగా ఇక్కడ యానిమల్ కీపర్లు ఏనుగులకు రోజూ చెరకు, పచ్చి గ్రాసం, రాగి సంగటి, నీరు ఆహారంగా వేస్తుంటారు. కొద్ది రోజులుగా వేసవి ఎండలు తీవ్రం కావడంతో రాగి సంగటి కంటే వాటి ఎన్‌క్లోజర్‌లో దొరికే సహజసిద్ధమైన ఆహారం కోసం ఏనుగులు వెతుక్కుంటున్నాయి. ఎన్‌క్లోజరులో చెట్ల నీడలో చేరి సేదదీరుతూ వాటి కొమ్మలు తింటూ ఎక్కువ సమయం గడుపుతూ సందర్శకులను అలరిస్తున్నాయి. జూ అధికారులు వాటి ఎన్‌క్లోజర్లలో నిత్యం నీటి సరఫరా చేయడం, నీటి కుండీలలో నీటిని నింపడంతో వాటికి ఉపశమనం కలుగుతోంది. - ఆరిలోవ







ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



26 తర్వాత.. సమ్మె?

- స్టీల్‌ప్లాంట్‌లో ముదురుతున్న కాంట్రాక్ట్ కార్మికుల వివాదం
- ఆర్‌ఎల్‌సీ సమావేశంపై అందరి చూపు
- సానుకూల నిర్ణయం రాకపోతే సమ్మె: నాయకుల ప్రకటన

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు వివాదం ముదురుతోంది. కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ తన నిర్ణయాన్ని మార్చుకోకపోవడంతో కార్మిక సంఘాలు సమ్మెకు సిద్ధమవుతున్నాయి. ఈ వ్యవహారంలో స్థానిక ప్రజాప్రతినిధులు మౌనం వహించడం గమనార్హం.

తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ఆదుకునే ప్రయత్నం చేయాల్సింది పోయి.. కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ తన చర్యలతో మరింత దిగజార్చేందుకు ప్రయత్నిస్తోంది. దేశంలోని ప్రైవేట్ స్టీల్‌ప్లాంట్లతో పోల్చి చూపిస్తూ.. విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో శాశ్వత, కాంట్రాక్ట్ కార్మికులు అధికంగా ఉన్నారనే సాకుతో వేలాది మంది ఉద్యోగుల మెడపై తొలగింపు కత్తి పెట్టింది. ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం ద్వారానే ప్లాంట్‌కు భవిష్యత్ ఉంటుందని స్టీల్‌ప్లాంట్ పర్యటనలో కేంద్ర ఉక్కు కార్యదర్శి సందీప్ పౌండ్రిక్ స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఉద్యోగులను ఇతర ప్లాంట్లకు డిప్యూటేషన్‌పై పంపడం, స్వచ్ఛంద పదవీ విరమణ పథకం(వీఆర్‌ఎస్) ద్వారా సుమారు 2,500 మందిని తగ్గించడం, దాదాపు 3,000 మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించాలని లక్ష్యంగా పెట్టుకుంది. గతంలో ఉద్యోగులను డిప్యుటేషన్‌పై పంపేందుకు నోటిఫికేషన్ జారీ చేయగా.. గత ఏడాది సెప్టెంబర్ 30న ఒకేసారి 3,000 మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించేందుకు ప్రయత్నించింది. అయితే కార్మిక సంఘాల తీవ్ర ఆందోళనల ఫలితంగా ఆ ప్రయత్నం విఫలమైంది. ఆ తర్వాత వీఆర్‌ఎస్‌కు సుమారు 1,130 మంది ఉద్యోగులు దరఖాస్తు చేయగా.. ప్రభుత్వం ఆమోదించింది.

ఆర్‌ఎల్‌సీ ఆదేశాలు బేఖాతర్

తాజాగా, కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపును మళ్లీ తెరపైకి తెచ్చింది యాజమాన్యం. ఇందులో భాగంగా గతంలో రెన్యువల్ చేయాల్సిన పలు కాంట్రాక్ట్‌లను నిలిపివేయడంతో దాదాపు 644 మంది కార్మికులు ఉద్యోగాలు కోల్పోయారు. ఈ చర్యను నిరసిస్తూ కాంట్రాక్ట్ కార్మిక సంఘాలు గత నెల 20న యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇచ్చాయి. ఈ నెల 7 తర్వాత ఎప్పుడైనా సమ్మెకు దిగుతామని హెచ్చరించాయి. దీంతో గత నెల 25న ప్రాంతీయ కార్మిక కమిషనర్(ఆర్‌ఎల్‌సీ) సమక్షంలో సమావేశం జరిగింది. ఆ సమావేశంలో తొలగించిన 644 మంది కార్మికుల జాబితాను ఇవ్వాలని ఆర్‌ఎల్‌సీ.. స్టీల్ యాజమాన్యాన్ని కోరారు. ఈ క్రమంలో ఈ నెల 5న దాదాపు 288 మంది కార్మికుల బయోమెట్రిక్‌ను ఆన్‌లైన్‌లో నిలిపివేయడంతో కార్మిక సంఘాలు మళ్లీ ఆర్‌ఎల్‌సీకి ఫిర్యాదు చేశాయి. ఈ నెల 11న జరిగిన సమావేశంలో ఆపివేసిన బయోమెట్రిక్‌ను 15వ తేదీలోగా పునరుద్ధరించాలని ఆర్‌ఎల్‌సీ సూచించారు. యాజమాన్య ప్రతినిధులు దీనికి అంగీకరించినప్పటికీ బయోమెట్రిక్ పునరుద్ధరణ జరగలేదని కార్మిక నాయకులు ఆరోపిస్తున్నారు. కాగా.. కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపునకు వ్యతిరేకంగా ఈ నెల 7న బీసీ గేటు వద్ద మానవహారం జరిగింది. ఈ నెల 9న గాజువాకలో పెద్ద ఎత్తున ధర్నా చేశారు. ఈ నెల 18న ఈడీ(వర్క్స్) బిల్డింగ్ వద్ద ఆందోళన చేశారు. 26న జరగనున్న ఆర్‌ఎల్‌సీ సమావేశంలో యాజమాన్యం నుంచి సానుకూల నిర్ణయం రాకపోతే సమ్మెకు వెళ్తామని నాయకులు ప్రకటించారు.

ప్రజాప్రతినిధుల మౌనం

స్టీల్‌ప్లాంట్‌కు ప్యాకేజీ ప్రకటించామని గొప్పలు చెప్పుకున్న స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు కార్మికుల తొలగింపుపై మౌనం వహించడం గమనార్హం. ఈ అంశాన్ని ఎంపీ, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ.. ఉక్కు మంత్రిత్వశాఖకు చెప్పి తొలగింపు ఆపే ప్రయత్నాలు చేయడం లేదని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సమ్మె జరిగితే..

ప్రస్తుతం రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తూ మంచి ఉత్పత్తిని సాధిస్తున్న తరుణంలో కాంట్రాక్ట్ కార్మికులు సమ్మె చేస్తే ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఇప్పుడిప్పుడే గాడిలో పడుతున్న ప్లాంట్‌కు ఇది మరింత నష్టం కలిగిస్తుంది. కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ, విశాఖ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం తమ మొండి వైఖరిని వీడి, కాంట్రాక్ట్ కార్మికుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలని కార్మిక సంఘాలు కోరుతున్నాయి.



సమ్మె నోటీసు అందజేయడానికి ర్యాలీగా వెళ్తున్న కాంట్రాక్ట్ కార్మికులు(ఫైల్)

ప్రైవేటీకరణ ప్రక్రియలో భాగంగానే తొలగింపు

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రక్రియలో భాగంగానే కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు చేపట్టారు. ఒకవైపు ప్లాంట్‌లో ఉత్పత్తి పెరుగుతుంటే కార్మికులను తొలగించడం అన్యాయం. తద్వారా ఉన్న వారిపై పనిభారం పెరుగుతుంది. యాజమాన్యం మొండికేస్తే సమ్మె చేయడం ఖాయం.

–జి.శ్రీనివాసరావు, అధ్యక్షులు, సీఐటీయూ కాంట్రాక్ట్ కార్మిక సంఘం

కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు అన్యాయం

స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపుపై కార్మిక సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఒకవైపు మూడు ఫర్నేస్‌లను నడుపుతామని యాజమాన్యం చెబుతూ.. మరోవైపు కాంట్రాక్ట్ కార్మికులను తొలగిస్తుండటం దుర్మార్గం. ఈ చర్యను వెంటనే ఆపకపోతే నిరవధిక సమ్మెకు దిగుతాం.

– మంత్రి రవి, ప్రధాన కార్యదర్శి, ఏఐటీయూసీ కాంట్రాక్ట్ కార్మిక సంఘం

ఆస్పత్రులకు కావాల్సిన పరికరాలపై నివేదికివ్వండి

ఏడీఎంఈ డాక్టర్ రఘునందన్

మహారాణిపేట: కేజీహెచ్‌లో రోగుల చికిత్సకు ఏమైనా పరికరాలు అవసరం ఉంటే వాటి వివరాలు, ఆస్పత్రి అభివృద్ధిపై నివేదిక తయారు చేసి ఇవ్వాల్సిందిగా రాష్ట్ర వైద్య విద్య అదనపు సంచాలకుడు(ఏడీఎంఈ) డాక్టర్ రఘునందన్ ఆదేశించారు. గురువారం కేజీహెచ్‌లో వివిధ విభాగాధిపతులు, ఇతర వైద్యులతో సమీక్ష జరిపారు. కేజీహెచ్‌తోపాటు, విమ్స్, ఇతర ఆస్పత్రులకు చెందిన సూపరింటెండెంట్లతో ప్రత్యేకంగా సమావేశమై ఆయా ఆస్పత్రులకు కావాల్సిన వసతులు, ఇతర పరికరాలకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. వాటి ప్రతిపాదనలను స్వీకరించారు. ఏఎంసీ ప్రిన్సిపాల్ సంధ్యాదేవి, సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద తదితరులు ప్రత్యేక నివేదిక తయారు చేసి, తనకు అందించాల్సిందిగా ఏడీఎంఈ సూచించారు.

రోగులకు మెరుగైన సేవలందించండి

కేజీహెచ్‌కు వచ్చే రోగులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలందించాలని ఏడీఎంఈ సూచించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా కేజీహెచ్, ఏఎంసీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని ఓపీ, క్యాజువాల్టీ, ఇతర విభాగాలను పరిశీలించారు. ఆస్పత్రిలో జరుగుతున్న మరమ్మతుల వివరాలను సూపరింటెండెంట్ శివానంద్ వివరించారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలో జరుగుతున్న ప్రత్యేక సదస్సుకు హాజరయ్యారు. అనంతరం ఏఎంసీ వద్ద నూతనంగా నిర్మించిన క్యాబ్ భవనాన్ని పరిశీలించారు. పీజీ విద్యార్థులతో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేజీహెచ్‌లో కొరతగా ఉన్న డ్రైవర్లు, వైద్యపరికరాలు, నూతన డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు అవసరమైన పరికరాలపై ప్రతిపాదనలు అందించినట్లు సూపరింటెండెంట్ శివానంద్ తెలిపారు.

ఆర్థో విభాగ వైద్యుని కేసుపై ఆరా

కేజీహెచ్ ఆర్థో విభాగం రెండో యూనిట్ ప్రొఫెసర్ డాక్టర్ లోక్‌నాథంపై ఫిర్యాదుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. ఆ వివరాలను ఏడీఎంఈ అడిగి తెలుసుకున్నారు.

తూర్పు నేవీలో ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ అధికారులు



తూర్పు నావికాదళ సందర్శనలో ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ యంగ్ ఆఫీసర్లు

సింధియా: గోపాల్‌పూర్‌లోని ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ కాలేజీ 125వ యంగ్ ఆఫీసర్స్ కోర్సుకు చెందిన డైరెక్టింగ్ సిబ్బంది 29 మంది గురువారం తూర్పు నావికాదళాన్ని సందర్శించారు. జాయింట్ మ్యాన్‌షిప్, ఇంటర్ సర్వీస్ సినర్జీని బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ పర్యటన జరిగింది. సందర్శనలో ఆఫీసర్లకు తూర్పు నావికాదళ కార్యకలాపాలు, ఆపరేషనల్ నావెల్ కమాండ్, సబ్‌మెరైన్స్, షోర్ సదుపాయాలు తదితర కార్యకలాపాలను నావికాదళ సిబ్బంది వివరించారు.

ఈఎన్‌సీలో ట్రైనీ ఐఏఎస్‌లు



తూర్పు నావికాదళ సందర్శనలో ట్రైనీ ఐఏఎస్‌లు

సింధియా: భారత్ సందర్శన్‌లో భాగంగా లాల్ బహదూర్‌శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్(ఎల్‌బీఎస్‌ఎన్‌ఏఏ) 126వ ఇండక్షన్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా 19 మంది ట్రైనీ ఐఏఎస్ అధికారులు తూర్పు నావికాదళా(ఈఎన్‌సీ)న్ని గురువారం సందర్శించారు. పౌర సైనిక సహకారాన్ని పెంపొందించే దిశగా సముద్ర భద్రతపై లోతైన అవగాహన కోసం వీరు ఈఎన్‌సీకి వచ్చారు. వీరికి నావికాదళ కార్యకలాపాలు, కార్యచరణ, కమాండ్ పాత్రలపై నేవీ అధికారులు అవగాహన కలిగించారు.

కనులపండువగా శ్రీవారి ఆలయ వార్షికోత్సవం

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం(టీటీడీ) తృతీయ వార్షికోత్సవం గురువారం కనులపండువగా సాగింది. ఉత్సవంలో భాగంగా ఉదయం 5 గంటల నుంచి 5.30 వరకు సుప్రభాతం, 5.30 నుంచి 7 గంటల వరకు తోమాల సహస్ర నామార్చన, మొదటి అర్చన నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు భక్తులకు సర్వదర్శనం కల్పించారు. ప్రత్యేకంగా తిరుమల తిరుపతి దేవస్థానం అర్చకుల ఆధ్వర్యంలో భగవత్ అనూజ్ఞ, విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, హోమం, ఉత్సవ మూర్తులకు అష్టోత్తర శత కలశ స్నపనం, పూర్ణాహుతి, అక్షతారోపణం, స్నపన తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు శ్రీవారి ఆలయ మాడ వీధుల్లో మంగళ వాయిద్యాల నడుమ కనులపండువగా తిరుచ్చి ఉత్సవం జరిగింది. టీటీడీ అర్చకులు, వేద పండితులు ఉత్సవ మూర్తులను ఊరేగిస్తుండగా.. భక్తులు గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణ నాటక ప్రదర్శన, భక్తుల కోలాటాలు, సామూహిక విష్ణు సహస్రనామ పారాయణలు, పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు, సూపరింటెండెంట్ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్లు శివకుమార్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.



వేడుకగా తిరుప్పావై ఉత్సవం

సీఐఐ చైర్మన్‌గా మురళీకృష్ణ

ఏయూక్యాంపస్: కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ(సీఐఐ) ఆంధ్రప్రదేశ్ శాఖ నూతన చైర్మన్‌గా ఫ్లంట్ గ్రిడ్ లిమిటెడ్ సంస్థ సీఈవో గన్నమనేని మురళీకృష్ణ ఎన్నికయ్యారు. ఆయన మహాత్మా గాంధీ కాన్సర్ ఆసుపత్రి ఎండీ డాక్టర్ వి.మురళీకృష్ణ నుంచి బాధ్యతలను స్వీకరించారు. ఎపెక్స్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.నరేంద్ర కుమార్ సీఐఐ వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. సీఐఐ వార్షిక సమావేశం ముగింపులో స్వర్ణాంధ్ర ప్రదేశ్–విజన్ 2047 అంశంపై చర్చా వేదిక నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆన్‌లైన్‌లో ప్రసంగించారు. సీఐఐ పనితీరు, పరిశ్రమల భాగస్వామ్యం తదితర అంశాలను అభినందించారు. భారత విదేశాంగశాఖ మంత్రిత్వశాఖ జాయింట్ సెక్రటరీ పి.ఎస్ గంగాధర్ వాణిజ్యం పెంచడంలో ఉన్న వ్యూహాత్మక ప్రయోజనాన్ని వివరించారు. సీఐఐ ఇండియా 100 కౌన్సిల్ రాజన్ నవాని మాట్లాడుతూ యువత శక్తి, ఆవిష్కరణల నుంచి ప్రేరణ పొందుతున్న విధానం గురించి వివరించారు. బోయింగ్ ఇండియా దక్షిణాసియా సీఎస్‌ఆర్ హెడ్ ప్రవీణ యాగ్నంభట్ మాట్లాడుతూ యువతకు అనేక అవకాశాలు ఉన్నాయని, విద్య, నైపుణ్యాల మధ్య వ్యత్యాసాన్ని సరిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. సీఐఐ పూర్వ చైర్మన్ సురేష్ రాముడు చిట్టూరి మాట్లాడుతూ ఏఐ వల్ల విద్యారంగంలో జరిగే మార్పులు, ఏఐని కరికులంలో భాగం చేయడం తదితర అంశాలపై ప్రసంగించారు. ఈస్టర్న్ నేవల్ కమాండ్ రియర్ అడ్మిరల్ ఆర్.ఎస్ ధలివాల్ దేశ రక్షణ రంగంలో పెరుగుతున్న వృద్ధిని వివరించారు. వార్షిక సమావేశంలో భాగంగా సీఐఐ ఏపీ పరిశ్రమల భద్రత ఎక్సలెన్స్ 2024 అవార్డులను ప్రదానం చేశారు. 59 సంస్థలకు రాష్ట్ర ఫైర్ సర్వీస్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ జనరల్ మాదిరెడ్డి ప్రతాప్ అందజేశారు. సీఐఐ ఏపీ కైజెన్ పోటీల విజేతలకు తొలిసారిగా అవార్డులను ప్రదానం చేశారు.



వార్షిక సంచికను విడుదల చేస్తున్న సీఐఐ ప్రతినిధులు

గేట్-2025లో దినేష్‌కు 23వ ర్యాంక్

సింహాచలం: గేట్–2025లో ఆలిండియా 23వ ర్యాంకును సాధించి సింహాచలం దరి శ్రీనివాస్‌నగర్‌కి చెందిన చింతా దినేష్ సత్తా చాటాడు. దినేష్ తాడేపల్లి గూడెంలోని ఎన్‌ఐటీలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. తండ్రి హరిశివప్రసాద్ అనకాపల్లి జిల్లా తుమ్మపాల పీహెచ్‌సీలో సీనియర్ అసిస్టెంట్. తల్లి సుజాత గృహిణి. టెన్త్‌లో 10 జీపీఏ, ఇంటర్‌లో 980 మార్కులు సాధించాడు. విజయనగరంలోని ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న మామయ్య కె.అజయ్ ప్రోత్సాహంతో దినేష్ చదువులో రాణిస్తున్నట్లు తల్లిదండ్రులు తెలిపారు. గేట్–2025లో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగంలో ఆలిండియా 23వ ర్యాంకు సాధించిన దినేష్‌ను కుటుంబ సభ్యులతో పాటు బంధువులు, సన్నిహితులు అభినందించారు.



ముడసర్లోవ పార్కులో అగ్ని ప్రమాదం



ఎగసిపడుతున్న మంటలు



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు పరిధిలోని ముడసర్లోవ పార్కులో గురువారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం సంభవించింది. పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడటంతో పాటు దట్టమైన పొగలు వ్యాపించడంతో సందర్శకులు, సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. పరిసర ప్రాంతాల ప్రజలు, వాహనచోదకులు ఆందోళన చెందారు. పార్కులో జీవీఎంసీ నీటి సరఫరా విభాగం సిబ్బంది అగ్నిమాపక దళానికి సమాచారం ఇచ్చి, అక్కడే ఉన్న ట్యాంకర్ల ద్వారా మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. అనంతరం చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను పూర్తిగా ఆర్పి వేశారు. ఈ ప్రమాదం కారణంగా పార్కులోని స్టోర్ రూం వద్ద భద్రపరిచిన 5 వేల లీటర్ల సామర్థ్యం గల ఆరు వాటర్ ట్యాంకులు, ఐదు హెచ్‌డీపీ పైపులు పూర్తిగా కాలిపోయాయి. అంతేకాకుండా స్టోర్‌రూం(పాత గెస్ట్ హౌస్) కిటికీలు, తలుపులు, ఒక పెద్ద చింత చెట్టు, వెదురు పొదలు కూడా దగ్ధమయ్యాయి. కాగా.. ఈ ప్రమాదం ఎలా జరిగిందనే దానిపై స్పష్టత లేదు. సందర్శకులెవరైనా కాల్చిన సిగరెట్ ఆకులపై వేయడం వల్ల మంటలు వ్యాపించి ఉండవచ్చని పార్కు సిబ్బంది భావిస్తున్నారు. పార్కులో చెత్త, చెట్ల ఆకులను సిబ్బంది ఇక్కడ స్టోర్ రూం సమీపంలో నీటి గ్యాలరీ పక్కన దిబ్బలుగా వేస్తారు. వాటికి తరచూ మంట పెట్టి కాల్చేస్తారు. అదే మాదిరిగా ఇప్పుడు కూడా మంట పెట్టడంతో అదుపు తప్పి.. వెదురు కొమ్మలకు అంటుకోవడం వల్ల ప్రమాదం జరిగి ఉండవచ్చని స్థానికులు అంటున్నారు.

కేజీబీవీల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

విశాఖ విద్య: జిల్లాలోని భీమునిపట్నం, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో నిర్వహిస్తున్న కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ జె.చంద్రశేఖర్ ఒక ప్రకటన విడుదల చేశారు. 6వ తరగతిలో 120 సీట్లు, 7వ తరగతిలో 2 సీట్లు, ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లో 120 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. అర్హులైన, ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు సమీప కేజీబీవీలను సంప్రదించాలని సూచించారు.

మిగులు భూముల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోండి

మహారాణిపేట: పట్టణ గరిష్ట పరిమితి చట్టం(యూఎల్‌సీ) పరిధిలోని మిగులు భూముల ఆక్రమణల క్రమబద్ధీకరణ కోసం డిసెంబర్ 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎం.మయూర్ అశోక్ కోరారు. 2019 మే ఒకటో తేదీకి ముందు భూమి ఆక్రమణలో ఉన్నట్లుగా రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, నిర్మాణానికి సంబంధించి జీవీఎంసీ అప్రూవల్ ప్లాన్, ఇంటి పన్ను, కరెంటు బిల్లు, వాటర్ ట్యాక్స్ రసీదుల నకళ్లతో సంబంధిత మండల తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేయాలని ఒక ప్రకటనలో సూచించారు. 150 చదరపు గజాల లోపు భూమిని ఉచితంగా, 151 చదరపు గజాల నుంచి 300 చదరపు గజాల వరకు ప్రస్తుత రిజిస్ట్రేషన్ బేసిక్ విలువలో 15 శాతం, 300 నుంచి 500 గజాల లోపు వరకు రిజిస్ట్రేషన్ బేసిక్ విలువలో 30 శాతం, 500 గజాల పైబడిన వాటికి ప్రస్తుత బేసిక్ విలువలో నూరు శాతం లెక్కించి చెల్లించాల్సి ఉంటుందన్నారు. జాయింట్ కలెక్టర్, కాంపిటెంట్ అధికారి, పట్టణ భూగరిష్ట పరిమితి చట్టం, విశాఖపట్నం పేరున డీడీ తీసి దరఖాస్తుతో జతపరిచి సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. బ్యాంకర్ చెక్కు కూడా అందజేయవచ్చన్నారు.

రూ.1.85 కోట్లకు ఆశీలు వేలం

గాజువాక: జీవీఎంసీ గాజువాక జోన్‌లో రోడ్ మార్జిన్ ఆశీలు వసూలు, వివిధ మార్కెట్లలో దుకాణాలకు సంబంధించిన ఆశీలు వసూలు వేలంను అధికారులు రూ.1.85 కోట్లకు ఖరారు చేశారు. ఈ కాంట్రాక్టును బొండా వెంకట సత్య ఇంజనీరింగ్ నిర్వాహకులు దక్కించుకున్నారు. గత ఏడాది ధనుష్ ఇంజనీరింగ్ సిబ్బంది రూ.1.05 కోట్లకు ఈ వేలంపాటను దక్కించుకోగా, ఈ ఏడాది అదనంగా రూ.80 లక్షలకు పెరిగినట్టు జోనల్ కమిషనర్ బి.ఆర్.ఎస్.శేషాద్రి తెలిపారు. ఈ పాటను అధికారులు రూ.1.05 కోట్లతో ప్రారంభించగా, సొంతం చేసుకోవడానికి ఐదుగురు కాంట్రాక్టర్లు పోటీ పడ్డారు. చివరకు బొండా వెంకట సత్య ఇంజనీరింగ్ నిర్వాహకులు దక్కించుకున్నారు.

మే ఫెయిర్‌కు భూమి కేటాయింపు

విశాఖ సిటీ: జిల్లాలో రిసార్ట్స్ కోసం ప్రభుత్వం భూమిని కేటాయించింది. మే ఫెయిర్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ లిమిటెడ్‌కు 40 ఎకరాలు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వాస్తవానికి భీమిలి మండలం అన్నవరంలో స్టార్ హటల్, రిసార్ట్స్ నిర్మాణానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే ఒప్పందం జరిగింది. ఇక్కడ మే ఫెయిర్‌తో పాటు ఒబెరాయ్ హోటల్స్, రిసార్ట్స్ రానున్నాయి. వీటితో మే ఫెయిర్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ లిమిటెడ్‌కు అన్నవరంలో సర్వే నంబర్ 109, 110లలో 40 ఎకరాలను కేటాయించింది. పీపీపీ విధానంలో మే ఫెయిర్ సంస్థ ఇక్కడ విల్లాల తరహాలో రిసార్టుల నిర్మాణం చేపట్టనుంది.

విద్యుత్ షాక్‌తో ఇంటర్ విద్యార్థి దుర్మరణం

శుభకార్యంలో విషాదం



దిలీప్ కుమార్ మృతదేహం

అక్కిరెడ్డిపాలెం: శుభకార్యానికి హాజరైన బాలుడు విద్యుత్ షాక్‌కు బలయ్యాడు. మేడ మీద ఆడుకుంటూ.. హైటెన్షన్ వైరు నుంచి వేలాడుతున్న మరో తీగను పట్టుకోవడంతో దుర్మరణం పాలయ్యాడు. గాజువాక సీఐ ఎ.పార్థసారథి తెలిపిన వివరాలివి. శ్రీనగర్ లైన్ 3 అఫీషియల్ కాలనీకి చెందిన అప్పలరాజు కుమారుడు గోపిశెట్టి దిలీప్‌కుమార్(16) గాజువాకలోని ఒక ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. చినగంట్యాడ నాయుడుగారి వీధిలో తమ బంధువుల ఇంట గురువారం జరిగిన ఓ శుభకార్యానికి గోపిశెట్టి అప్పలరాజు కుటుంబ సమేతంగా హాజరయ్యారు. ఫంక్షన్ జరుగుతుండగా దిలీప్ కుమార్ మేడ మీదకు వెళ్లి ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో మేడ చివరన ఓ తీగ వేలాడుతుండగా దిలీప్ దానిని పట్టుకుని లాగాడు. ఆ వైరు హైటెన్షన్ వైరు నుంచి కొనసాగుతుండటంతో.. దిలీప్ విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. కొంత సమయానికి మేడపైకి వెళ్లిన బంధువులు దిలీప్ కుమార్ వైరు పట్టుకుని పడి ఉండటం చూసి వెంటనే గాజువాకలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే దిలీప్ కుమార్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అప్పలరాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నజీర్ తెలిపారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.

పరీక్షలు బాగా రాయలేదని విద్యార్థి బలవన్మరణం

గోపాలపట్నం: గుండెలు పిండేసే విషాదం.. ఇంటర్ పరీక్షలు సరిగా రాయలేకపోయానని తీవ్ర మనస్తాపానికి గురైన అంబటి రేవంత్ కుమార్(18) ఆత్మహత్య చేసుకున్నాడు. ఒక్కగానొక్క కొడుకు ఇక లేడన్న వార్త ఆ తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగిల్చింది. ఎన్‌ఏడీ కరాసా సమీపంలో బుధవారం అర్ధరాత్రి రైలు కింద పడి మృతి చెందిన ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. జీఆర్పీ తెలిపిన వివరాలివి. రేవంత్ కంచరపాలెం ఇందిరానగర్–4లో నివాసముంటున్నాడు. ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న రేవంత్, పరీక్షలు బాగా రాయలేదని తీవ్రంగా బాధపడ్డాడు. ఈ క్రమంలోనే అర్ధరాత్రి రైలు పట్టాలపైకి వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. రేవంత్ తండ్రి శంకరరావు గోశాల ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నారు. రేవంత్‌కు ఒక తమ్ముడు ఉండేవాడు. రెండేళ్ల వయసులోనే అనారోగ్యంతో మృతి చెందాడు. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో రేవంత్ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. 'అల్లారు ముద్దుగా చూసుకున్నాం.. ఇంతలోనే ఈ ఘోరం చూస్తామనుకోలేదు' అంటూ వారు రోదిస్తున్న తీరు స్థానికులనుకంటతడి పెట్టించింది. గవర్నమెంట్ రైల్వే పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఎస్‌ఐ రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే డాక్టర్ల నిర్లక్ష్యంతోనే చిన్నారి మృతి

- ఆమె తల్లిదండ్రులు, బంధువుల ఆరోపణ
- ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ నాయకులతో కలిసి ఆందోళన

తాటిచెట్లపాలెం: దొండపర్తిలోని రైల్వే ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగా మూడేళ్ల చిన్నారి హన్విక మృతి చెందిందని ఆమె తల్లిదండ్రులు ఆరోపించారు. దీనిని నిరసిస్తూ చిన్నారి బంధువులు, యూనియన్ నాయకులు రైల్వే ఆస్పత్రి వద్ద ఆందోళన చేపట్టారు. తల్లిదండ్రులు, బంధువులు తెలిపిన వివరాలివి.. వాల్తేరు డివిజన్, ఇంజినీరింగ్ విభాగంలో ట్రాక్ మెయింటైనర్‌గా పనిచేస్తున్న ఎస్.శ్రీనివాసరావు కుమార్తె హన్విక బుధవారం ఉదయం తీవ్రమైన కడుపు నొప్పికి గురైంది. దీంతో కుటుంబ సభ్యులు రైల్వే ఆస్పత్రికి తీసుకొచ్చారు. చిన్నారిని మొదట క్యాజువాలిటీకి తీసుకెళ్లగా.. అక్కడ సిబ్బంది ఓపీకి వెళ్లమని సూచించారు. ఓపీ వద్ద వేచి ఉన్న సమయంలో నొప్పి తీవ్రం కావడంతో మళ్లీ క్యాజువాలిటీకి తీసుకువచ్చారు. అక్కడ పాపను వార్డులోకి పంపి ఇంజక్షన్లు చేసినప్పటికీ సరైన చికిత్స అందించలేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. గురువారం తెల్లవారుజామున 2.30 గంటల నుంచి పాప తీవ్రమైన నొప్పితో బాధపడుతున్నా.. వైద్య సిబ్బంది పట్టించుకోలేదని వాపోయారు. ఉదయం చిన్న పరీక్షలు చేసి పల్స్, హార్ట్ బీట్ ఆగిపోయిన తర్వాత మెడికవర్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడకు తీసుకెళ్లిన అనంతరం వైద్యులు పాప మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో ఆగ్రహించిన చిన్నారి బంధువులు, ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ నాయకులు చిన్నారి మృతదేహంతో రైల్వే ఆస్పత్రి ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోరా యూనియన్ నాయకులు, బాధిత కుటుంబ సభ్యులతో చర్చలు జరిపారు. ఘటనపై విచారం వ్యక్తం చేస్తూ.. వెంటనే ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన సద్దుమణిగింది.



రైల్వే ఆస్పత్రి వద్ద చిన్నారి మృతదేహంతో ధర్నా చేస్తున్న తల్లిదండ్రులు, యూనియన్ నాయకులు

ప్రధాని యోగా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎంవీపీకాలనీ: ప్రధాన మంత్రి యోగా పురస్కారాలకు కేంద్రం దరఖాస్తులను ఆహ్వానిస్తోందని సెట్విన్ విశాఖపట్నం ముఖ్యకార్యనిర్వహణ అధికారి ఎం.సత్యపద్మ ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో యోగా అభివృద్ధికి కృషిచేసి, కనీసం యోగా రంగంలో 20 ఏళ్ల అనుభవం, అద్భుతమైన ట్రాక్ రికార్డ్ ఉన్న వారు ఈ అవార్డుకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. https://innovateindia.mygov. in/mygov.in/pm&yoga&awards&2025 పోర్టల్ ద్వారా ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. జాబితాను అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని జూన్ 21న ప్రకటిస్తారని తెలిపారు.

డీఆర్‌ఎం తనిఖీలు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధిలో దువ్వాడ, నౌపడ, పర్లాకిమిడి సెక్షన్లలో డీఆర్‌ఎం లలిత్ బోరా సీనియర్ అధికారులతో కలిసి గురువారం తనిఖీలు నిర్వహించారు. ఆయా స్టేషన్లలో జరుగుతున్న స్టేషన్, యార్డ్ అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం దువ్వాడ నుంచి నౌపడ వరకు గల పలు కీలక ప్రాంతాలు, యార్డుల్లో విండో ట్రయలింగ్ ఇన్‌స్పెక్షన్ కూడా చేపట్టారు. పర్లాకిమిడి, నౌపడ స్టేషన్లలో అమృత్ భారత్ పథకంలో భాగంగా జరుగుతున్న స్టేషన్ డెవలప్‌మెంట్ పనులను పరిశీలించారు.